# ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**బల్లికురవ, జనవరి 26, ప్రభాతవార్త**



సార్వభౌమ ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాంగా అధికారికంగా భారతదేశాన్ని స్థాపించిన రోజైన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవి నాయక్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ ఆదర్శాలను ప్రజలంతా పాటించాలని, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను సద్వినియోగం చేసుకుంటూ, పవిత్ర భారతావనిలో గ్రామ సీమలు అభివృద్ధిలో అగ్రభాగాన నిలవాలని ఆకాంక్షించారు. ఈ పర్వదినం సందర్భంగా గ్రామ గ్రామాన మువ్వన్నెల పతాకం రెపరెపలతో పల్లె సీమలు పులకించిపోయాయి. వందేమాతరం గీతానికి 150 సంవత్సరాలు సందర్భంగా చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా దేశభక్తి భావంతో గీతాన్ని ఆలపించి తన్మయత్వం చెందారు. తహసీల్దార్ రవి నాయక్, ఎంపీడీవో కుసుమకుమారి, కస్తూరిబా ప్రత్యేక అధికారి సరళ కుమారి, ఏపీఎం రాజారావు, విద్యాశాఖ అధికారి రమేష్‌బాబు, పోలీసు స్టేషన్‌లో సిబ్బంది, జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుధాకర్‌రావు తదితరులు జాతీయ పతాకాన్ని ఎగురవేసి ఈ శుభదినం యొక్క ప్రాధాన్యతను వివరించారు.

# వరుసగా రెండవ ఏడాది అందిన అరుదైన పురస్కారం





**బల్లికురవ, జనవరి 26, ప్రభాతవార్త**

విధి నిర్వహణలో అంకితభావం, నిజాయితీ, అత్యుత్తమ ప్రతిభ కనపరిచినందుకు బల్లికురవ ఎస్సై యామినేని నాగరాజు వరుసగా రెండవ ఏడాది ఉత్తమ ఎస్సైగా ప్రశంసా పత్రం అందుకున్నారు. 77వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబు చేతుల మీదుగా సోమవారం ఈ అరుదైన పురస్కారాన్ని అందిపుచ్చుకున్నారు. బల్లికురవ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి పలు క్లిష్టతర సమస్యల పరిష్కారంలో నాగరాజు తనదైన ముద్ర వేసుకున్నారు. నేరాల నియంత్రణలో తన ప్రతిభను చూపుతూనే, మహిళలకు, పలు కేసులలో బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు శాఖపరంగా తనదైన ముద్ర వేసుకున్నారు. ఇటీవల ట్రాక్టర్ ట్రక్కులు, వ్యవసాయ పరికరాలు దొంగిలించే ముఠా ఆట కట్టించడంలో ఫిర్యాదు అందిన రెండు రోజుల వ్యవధిలోనే తన ప్రతిభను చాటారు. సిబ్బందితో మమేకమవుతూ కత్తి మీద సాము లాంటి బల్లికురవ మండలంలో చాణక్య నీతిని ప్రదర్శిస్తూ కేసుల పరిష్కారంలోను, శాంతి భద్రతల పరిరక్షణలోనూ తనదైన ముద్ర వేసుకున్నారు. ఈ క్రమంలోనే ఆయనకు వరుసగా రెండవ ఏడాది గణతంత్ర దినోత్సవ ఉత్తమ అధికారి పురస్కారం దక్కింది. బల్లికురవ క్లస్టర్ ఇన్‌చార్జి మలినీడి గోవిందరావు, ఏఎంసీ ఉపాధ్యక్షులు దేవినేని నరేంద్ర, మండల పార్టీ అధ్యక్షులు దూళిపాల హనుమంతరావు, నీటి సంఘం అధ్యక్షులు దరిశి రామస్వామి, చిడిపోతు నరేంద్ర, మందలపు సుధాకర్, తెలుగు యువత అధ్యక్షులు దూళిపాళ్ల పున్నారావు, తదితరులు ఎస్సై నాగరాజును అభినందించారు.

# ఉత్తమ ఉపాధ్యాయురాలుగా శ్రీదేవి

**బల్లికురవ, జనవరి 26, ప్రభాతవార్త**



స్థానిక కస్తూరిబా గాంధీ గురుకుల విద్యాలయంలో సామాన్య శాస్త్రం ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్న ఎస్.శ్రీదేవి ఉత్తమ ఉపాధ్యాయురాలి పురస్కారం అందుకున్నారు. 77వ భారత గణతంత్ర దినోత్సవ ఉత్సవాలలో భాగంగా సోమవారం బాపట్లలో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ చేతుల మీదుగా పురస్కార పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రత్యేక అధికారి సరళ కుమారి, అధ్యాపక బృందం ఆమెను అభినందించారు.

## ఎంపీడీవో కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు



**వలేటివారిపాలెం, జనవరి 26, ప్రభాతవార్త**

77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా వలేటివారిపాలెం మండలంలో ప్రజా పరిషత్ కార్యాలయం నందు ఎంపీడీవో వై.శంకరరావు జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం జాతీయ గీతం ఆలపించి స్వాతంత్ర సమరయోధులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జడ్పీటీసీ, సొసైటీ అధ్యక్షులు, ఇతర నాయకులు, డిప్యూటీ ఎంపీడీవో, ఏపీఎం, ఏపీవో, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ తహసీల్దార్‌గా ప్రశంసా పత్రం అందుకున్న మురళి

**జరుగుమల్లి, జనవరి 26, ప్రభాతవార్త**



జరుగుమల్లి తహసీల్దార్‌గా అందించిన సేవలకు గాను 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం తహసీల్దార్ పి.మురళి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా సేవలను గుర్తించి గణతంత్ర దినోత్సవం రోజున కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రంను తీసుకోవడం చాలాగౌరవంగా భావిస్తున్నా నన్నారు. నాకు సహకరిస్తున్న కార్యాలయ సిబ్బంది, జరుగుమల్లి మండల ప్రజలందరికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలు చేసే విధంగా మంచి ఆరోగ్యం ఆ దేవుడు ప్రసాదించాలని ఆయన అన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు

**జరుగుమల్లి, జనవరి 26, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన జరుగుమల్లి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాలాపన చేస్తూ జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేసి గ్రామ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పి.మురళి మాట్లాడుతూ రాజ్యాంగం అందించిన హక్కులు స్వేచ్ఛ మానవత్వాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడు బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎగరని జెండా

**- అధికారుల నిర్లక్ష్యం పట్టీపట్టని వ్యవహార శైలి**

**పుల్లలచెరువు, జనవరి 26, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన పుల్లలచెరువులో అగ్రికల్చర్ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేయకుండా ఆ కార్యాలయం వెలవెలబోయింది. అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిన ఘటన తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. గణతంత్ర దినోత్సవం పండుగ రోజున ప్రభుత్వ కార్యాలయంలో త్రివర్ణ పతాకం ఎగురవేయకపోవడం ద్వారా దేశభక్తి, జాతీయ గౌరవం పట్ల అధికారుల వైఖరి ఏ స్థాయిలో ఉందో ఈ ఘటన స్పష్టంగా అర్థమవుతుంది. ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనలు స్పష్టంగా ఉన్నప్పటికి, రైతులకు సేవలందించాల్సిన అగ్రికల్చర్ శాఖ కార్యాలయంలోనే ఈ విధమైన అవమానం చోటు చేసుకోవడం ప్రజలను విస్మయానికి గురి చేసింది. ఇది కేవలం నిర్లక్ష్యం కాదు, ఇది జాతీయ బాధ్యతను తృణప్రాయంగా భావించిన దారుణ ఉదాహరణ అని స్థానికులు తీవ్రంగా మండిపడుతున్నారు. జాతీయ పతాకాన్ని గౌరవించడం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి యొక్క ప్రాథమిక కర్తవ్యమని రాజ్యాంగమే చెబుతున్నా, అగ్రికల్చర్ కార్యాలయ అధికారులు మాత్రం ఆ కర్తవ్యాన్ని కాలరాశారని విమర్శలు వినిపిస్తున్నాయి. రైతుల సమస్యల పరిష్కారంలో ముందుండాల్సిన అధికారులు, కనీసంగా జెండా ఎగురవేయడం వంటి బాధ్యతను కూడా నిర్వర్తించకపోవడం పరమ దురదృష్టకరమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి నిర్లక్ష్యంపై తక్షణమే శాఖాపరమైన విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు, సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. జాతీయ పతాకాన్ని అవమానించే ఇలాంటి ఘటనలు కొనసాగితే ప్రజల్లో ప్రభుత్వ వ్యవస్థలపై నమ్మకం సడలిపోతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇకనైనా ఉన్నతాధికారులు కళ్లు తెరిచి బాధ్యులపై ఉదాహరణాత్మక చర్యలు తీసుకోవాలని ప్రజలు గట్టిగా కోరుతున్నారు.

# ఐసీడీఎస్ ఉత్తమ సూపర్‌వైజర్‌గా లలిత సలోమి

**పెద్దదోర్నాల, జనవరి 26, ప్రభాతవార్త**



స్త్రీ శిశు సంక్షేమ రంగాలలో విశిష్ట సేవలు అందించినందుకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మకమైన బెస్ట్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అవార్డును, ప్రశంసా పత్రాన్ని జిల్లా కేంద్రం మార్కాపురం లో సోమవారం జరిగిన 77వ గణతంత్ర వేడుకలలో జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చేతుల మీదుగా బేస్తవారిపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ పి.లలితా సలోమి బెస్ట్ సూపర్‌వైజర్ అవార్డు స్వీకరించారు. అంగన్‌వాడీ కేంద్రాల సమర్థమైన నిర్వహణ, గర్భిణీ, బాలింతలకు, చిన్నారులకు పోషకాహారం అందించడంలో చూపిన చొరవ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో సమర్ధంగా అమలుపరిచినందుకు ఆమెను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. తల్లి శిశు ఆరోగ్యం, చిన్నారుల పోషణ, అవగాహన కార్యక్రమం నిర్వహణలో సూపర్‌వైజర్ లలిత సలోమి విశేష కృషి చేసినట్లు అధికారులు ప్రశంసించారు. అవార్డు అందుకున్న అనంతరం సూపర్‌వైజర్ లలితా సలోమి మాట్లాడుతూ తనకు ఈ గౌరవం లభించడం ఎంతో ఆనందంగా ఉందని, అధికారులు, సిబ్బంది అంగన్‌వాడీ కార్యకర్తల సహకారంతో సాధ్యపడిందని, ఈ అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందని సూపర్‌వైజర్ లలితా సలోమి పేర్కొన్నారు.

# అంబరాన్నంటిన సాంబన్న సంబరం

- ఘనంగా ఎమ్మెల్యే ఏలూరి జన్మదినోత్సవ వేడుకలు
- ఊరు వాడ కేక్ కటింగ్ అన్నదానాలు
- వృద్దాశ్రమంలో అన్నదానం, దుప్పట్లు పంపిణీ
- విద్యార్థులకు నోటు పుస్తకాలు, అన్నదానం
- ఉచిత కంటి వైద్యశిబిరం, రక్తదాన శిబిరం

**మార్టూరు, జనవరి 26, ప్రభాతవార్త**





అభివృద్ధి ప్రదాతగా, యువకులు, పేదల ఆశల ప్రతిరూపంగా నిలిచిన యంగ్ అండ్ డైనమిక్ లీడర్ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు జన్మదినోత్సవ వేడుకలు పర్చూరు నియోజకవర్గం వ్యాప్తంగా అంబరాన్నంటాయి. గణతంత్ర దినోత్సవం రోజునే ఆయన పుట్టిన రోజు రావడంతో సంబరాలు మరింత ఘనంగా నిర్వహించగా, ప్రజల అభిమానం ఎల్లలు దాటింది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఆస్ట్రేలియా, అమెరికాలో సాంబన్న బర్త్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. మండల పార్టీ అధ్యక్షులు శంషుద్దీన్, పోద వీరయ్య, తాటి నాగేశ్వరరావు, రంగయ్య చౌదరి, శ్రీహరి, హనుమంతరావుల ఆధ్వర్యంలో మండల కేంద్రాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మార్టూరులోని వృద్దాశ్రమాల్లో అన్నదానం నిర్వహించి దుప్పట్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించారు. పర్చూరు మూగ, చెవిటి స్కూల్లో విద్యార్థులకు అన్నదానం, నోటు పుస్తకాలు అందజేశారు. నియోజకవర్గంలో దేవాలయాలు, చర్చిలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హైదరాబాద్ నోవా అగ్రి గ్రూప్స్ సంస్థ ప్రధాన కార్యాలయంలో అలాగే ఎన్టీఆర్ ట్రస్టు సహకారంతో ఏలూరి రమేష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహించగా, హైదరాబాద్‌లోనూ అభిమానులు రక్తదానం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అలాగే ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో తెలుగు యువత ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఆస్ట్రేలియా, అమెరికాలో నివసిస్తున్న పర్చూరు వాసులు సైతం సాంబన్న జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం విశేషం. ఆస్ట్రేలియా మెల్‌బోర్న్ డాక్టర్ కైపు రమణారెడ్డి, కామేపల్లి బాలకృష్ణ, మాలంపాటి బాలు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఏలూరి నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్టు, నోవా అగ్రి గ్రూప్, గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. చిన్నగంజాం సముద్రతీర ప్రాంతంలో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. బాపట్ల పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి నక్కల రాఘవ, కొండ్రగుంట శ్రీహరి ఆధ్వర్యంలో సుమారు50 పడవలపై నాయకులు, కార్యకర్తలు వేడుకలు నిర్వహించారు. సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. అలాగే రాష్ట్ర మంత్రులు కింజరపు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్ధన్‌రెడ్డి, అనిత, కొలుసు పార్ధసారధి, డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, అలాగే ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే ఏలూరికి శుభాకాంక్షలు తెలిపారు.

# విజేతలకు బహుమతులు అందజేత

**మార్టూరు, జనవరి 26, ప్రభాతవార్త**



రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు వారి ఆధ్వర్యంలో మార్టూరు మండలంలోని మార్టూరు గ్రామంలో జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద రొటేరియన్ మురకొండ ఈశ్వర్ ప్రసాద్ ఆర్థిక సహకారంతో ప్రైవేటు స్కూళ్లకు పోటీగా గవర్నమెంట్ స్కూల్స్ పిల్లలకు సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించి, అందులో మొదటి, రెండవ, మూడవ బహుమతులు నిర్ణయించి వారితో పాటు ఆ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి వారికి 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా గిఫ్టులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, రొటేరియన్ మురకొండ ఈశ్వర్ ప్రసాద్, డాక్టర్ కిషోర్ కుమార్, స్కూల్ హెడ్‌మాస్టర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో రెపరెపలాడిన జాతీయ జెండా

**- త్యాగమూర్తులను స్మరించుకుంటూ పండుగలా గణతంత్ర వేడుకలు**

**పుల్లలచెరువు, జనవరి 26, ప్రభాతవార్త**





మండల కేంద్రమైన పుల్లలచెరువులో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. తహసీల్దార్ కార్యాలయంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను ఉద్దేశించి డిప్యూటీ తహసీల్దార్ పుల్లారెడ్డి కార్యాలయ ఆవరణంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. తదుపరి ఆయన మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం యొక్క విశిష్టతను ఆయన తెలిపారు. అదే విధంగా ఎంతో మంది త్యాగమూర్తుల కష్ట ఫలితమే ఈ స్వాతంత్ర్య, గణతంత్ర వేడుకలకు మూలం అని ఆయన కొనియాడారు. మండల పరిషత్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మరియదాసు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాణంలో తీసుకున్న చొరవ ఆయన పడిన కష్టాన్ని ఆయన తెలియజేశారు. ఈ స్వాతంత్ర్య ఉద్యమంలో మహనీయులతో పాటు అనేక లక్షల మంది ప్రజల త్యాగఫలితం ఉందన్నారు. ఆ తరువాత సచివాలయం 1, సచివాలయం 2 కార్యాలయాల్లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేసి ఫలహారాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం అనేది కేవలం పండుగ మాత్రమే కాదు. మన స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం అన్నారు. మన రాజ్యాంగ నిర్మాణానికి ప్రజాస్వామ్యమే పునాది అన్నారు. ప్రజల చేత ప్రజల కోసం ప్రజల ద్వార పాలనను అందించడానికి ఇది ఒక మార్గాన్ని నిర్దేశిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ సామాజిక సేవకుడికి అవార్డు

**యర్రగొండపాలెం, జనవరి 26, ప్రభాతవార్త**



మార్కాపురం నూతన జిల్లాగా ఆవిష్కరణ జరిగిన తరువాత మొదటి సారిగా గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుగుతున్న విషయం విధితమే. అందులో భాగంగా తొలి సారిగా మారుమూల యర్రగొండపాలెం ప్రాంతంలోకి వచ్చి ఇక్కడ సామాజిక సేవ నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థను పరిగణలోకి తీసుకుని ఈ ప్రాంతంలో సామాజిక సేవ చేస్తున్న ముస్లిం యూత్ సొసైటీ గుర్తించి సొసైటీ అధ్యక్షుడు అయిన డాక్టర్ షేక్ ఇస్మాయిల్‌కు ఉత్తమ సామాజిక సేవ అవార్డుకు ఎంపిక చేశారు. సోమవారం మార్కాపురం కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు చేతుల మీదుగా షేక్ ఇస్మాయిల్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. పశ్చిమ ప్రకాశం ప్రాంతంలో యర్రగొండపాలెం నియోజకవర్గ స్థాయిలో ఎంతో మంది నిరుపేద ప్రజలకు కుల మతాలకు పార్టీలకు అతీతంగా అనేక సేవలు అందించినందుకు ఆయనకు ఇలాంటి గౌరవం దక్కడం అభినందనీయమని సొసైటీ తరుపున సహాయం పొందిన యర్రగొండపాలెం ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

# మువ్వన్నెల రెపరెప



**తాళ్లూరు, జనవరి26,పభాతవార్త**

గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. తాళ్లూరులోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయజెండాను అధికారులు ఎగురవేశారు. మండలపరిషత్ కార్యాలయంలో వద్ద ఎంపీడీఓ పి. అజిత, ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ప్రధానోపాధ్యాయులు జాతీయ జెండాను ఎగుర వేశారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షులు మేడగం వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, నాయకులు గొల్లపూడి వేణుబాబు, రాచకొండవెంకట్రావు, పిన్నిక రమేష్, శివ నాగిరెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ హనుమంతరావు, ఏపీఓ వెంకటేశ్వర్లు, ఆర్ఐ సుధీర్, ఎంఈవో సుబ్బయ్య, వీఆర్వోలు చంద్రశేఖర్‌రావు, చిన్న కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలకు పురస్కారం



**తాళ్లూరు, జనవరి26,పభాతవార్త**

జనవరి 26విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసిన రెవిన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్ ఐ ) ఎంవీఎస్ సుధీర్ కుమార్‌కి గణతంత్ర వేడుకలను పురస్కరించు కుని ఒంగోలు పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో జిల్లా కలెక్టర్ పీ. రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్ రాజు చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవిన్యూ శాఖలో ప్రజలకు చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం అవార్డును అందించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. పలువురు ప్రజా ప్రతినిధులు ,అధికారాలు సుధీర్‌కుమార్‌ని అభినందించారు.

## ఉత్తమ ఎంపిడివో డాక్టర్ సుజాత, ఉత్తమ తహసీల్దారుగా పుల్లారావు

**పొన్నలూరు, జనవరి 26, ప్రభాతవార్త**



పొన్నలూరు తహసీల్దార్ పుల్లారావు, ఎంపిడివో డాక్టర్ పి.సుజాత విధి నిర్వహణలో ఆదర్శవంతమైన పనితీరుకనబరచినందుకుగాను జిల్లా ఉన్నతాధికారుల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రకాశం జిల్లా కలెక్టర్ పి.రాజా బాబు, ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ హిమవంశీ, చేతుల మీదుగా వీరు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. అదేవిధంగా మండలం నుండి ఉత్తమ డిప్యూటీ తహసీల్దారుగా స్రవంతి, వీఆర్వోగా రవి, విద్యుత్‌శాఖకు చెందిన ఎడ్లురుపాడు లైన్ మన్ నాగార్జున, తదితరులు కూడా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. జిల్లా ఉత్తమ ఎంపిడివోగా ఎంపికైన ఎంపిడివో సుజాత, తహసీల్దార్ పుల్లారావు, ప్రశంసాపత్రాలు పొందిన వారికి ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు, పలువురు ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

## ఉత్తమ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవ్‌కుమార్

**ఒంగోలు, జనవరి 26, ప్రభాతవార్త**



ఈ రోజు 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకాశం జిల్లా కలెక్టర పి రాజబాబుచే అభినందనలు పొందిన డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవ్‌కుమార్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న కార్యక్రమా లను ప్రశంసించారు వారికి ప్రశంస మెరిట్ సర్టిఫికెట్ను అందజేశారు. హర్ష ప్రీతం దేవ్ కుమార్ చేసే సేవలు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో చెట్లను నాటడం పెంచడం మరియు రక్తదాన శిబిరాలను నిర్వహించడం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొనడం ఎయిడ్స్ ర్యాలీని నిర్వహించడం ప్లాస్టిక్ నిర్మూలన వాతావరణ కాలుష్య నిర్మూలనకు ర్యాలీని నిర్వహించడం యువత మత్తుపానీయాలకు లోనవ్వకుండా చైతన్య ర్యాలీని నిర్వహించడం అనేక ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలను నిర్వహించడం ద్వారానే సామాజిక చైతన్యం కలుగుతుందనే డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవ్ కుమార్ పేర్కొన్నారు .

## ఎక్సైజ్ సీఐ శివకుమారికి కామెండేషన్ ప్రశంసాపత్రం

**సింగరాయకొండ, జనవరి 26, ప్రభాతవార్త**



77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం విజయవాడలోని ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో ఎక్సైజ్ సీఐ ఎం. శివకుమారికి కామెండేషన్ ప్రశంసాపత్రం లభించింది. ఈ ప్రశంసాపత్రాన్ని ఎక్సైజ్ డైరెక్టర్ చామకూరి శ్రీధర్ ఆమెకు అందజేశారు. విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణతో పాటు సమర్థవంతమైన సేవలు అందిస్తూ శాఖ ప్రతిష్ఠను పెంపొందించినందుకు సీఐ శివకుమారిని ఈ సందర్భంగా సత్కరించారు. అక్రమ మద్యం నియంత్రణ, ప్రభుత్వ నిబంధనల అమలులో ఆమె చూపిన చొరవను ఉన్నతాధికారులు ప్రశంసించారు. ఈ అవార్డు లభించడంపై ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది సీఐకి అభినందనలు తెలిపారు.

## రాయల్ హైస్కూల్, పయనీర్స్ స్కూల్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు

**మార్టూరు, జనవరి 26, ప్రభాతవార్త**



77వగణతంత్ర దినోత్సవాన్ని పురష్కరించు కుని రాయల్ హైస్కూల్, పయనీర్స్ స్కూల్ నందు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయల్ విద్యా సంస్థల అధినేత పేరం రవీంద్రబాబు జెండా వందనం చేశారు. ముఖ్య అతిథిగా సంబయ్య పాల్గొని ప్రసంగించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను అలరించాయి. ముఖ్యంగా విద్యార్థిని ప్రదర్శించిన భరతమాత వేషధారణ ఎంతగానో ఆకట్టుకుంది. విద్యార్థుల ఉపన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి కే.మధుబాబు, ప్రధానోపాధ్యాయులు డీవీ బాల సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**మార్టూరు, జనవరి 26, ప్రభాతవార్త**



మండలంలోని దేగరమూడి గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠ జరుగు స్థలంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించరు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దేగరమూడి గౌరవ అధ్యక్షుడు పులిపాటి సుబ్బారావు ప్రమోద్, కింగ్, విజయబాబు, జి.సుబ్బారావు, అజయ్ పాల్గొన్నారు. జంపాని వీరయ్య చౌదరి, సర్పంచ్ ఫ్లాగ్ ఆవిష్కరణ చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు.

# ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**నాగులుప్పలపాడు, జనవరి 26, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన నాగులుప్పలపాడు మండల పరిషత్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి, ఎంపీడీవో తేళ్ళ రవికుమార్‌లు జాతీయ జెండా ఆవిష్కరణ చేశారు. దేశభక్తుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని చీర్వానుప్పలపాడు గ్రామ సచివాయలంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేడికొండ చెన్నమ్మ, కార్యదర్శి శ్రీదేవి, మేడికొండ మురళి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, సచివాలయం సిబ్బంది, పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## ప్రజలందరికి 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

**- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్**



**యర్రగొండపాలెం, జనవరి 26, ప్రభాతవార్త**

బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు ఇది అని రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తిచంద్రశేఖర్ అన్నారు. యర్రగొండపాలెం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద గణతంత్ర దినోత్సవం సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్వాతంత్ర్య సంబరం ఎందరో మహనీయుల త్యాగ ఫలితం అని,మన కోసం ప్రాణాలర్పించిన మహానుభావుల ఆత్మలకు శాంతి కలగాలని, స్వాతంత్ర్య సమరయోధులు చూపిన బాటలో మనమంతా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆ మహానుభావులు చెప్పిన మాటలను గుర్తు చేసుకుంటూ, వారి ఆశయాలను కొనసాగించేలా ముందడుగు వేయాలని, దేశభక్తితో మన హృదయాలను నింపుకోవాల్సిన సమయం ఇది అని పేర్కొన్నారు. అదే విధంగా మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తూనే, ప్రపంచంలోని అన్ని దేశాలకన్నా మన భారతదేశమే మిన్న అనేలా గణతంత్ర ఉత్సవాలను జరుపుకోవాలని రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఏకుల ముసాలారెడ్డి, ఒంగోలు మూర్తిరెడ్డి, పుల్లలచెరువు నాయకులు తమ్మినేని సత్తిరెడ్డిలతో పాటు మిగతా మండలాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు



**యర్రగొండపాలెం, జనవరి 26, ప్రభాతవార్త**

యర్రగొండపాలెం నియోజకవర్గం 77వ గణతంత్ర దినోత్సవసందర్భంగా సోమవారం యర్రగొండ పాలెం పట్టణంలోని బంగ్లా రోడ్డులోని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గణతంత్ర దినోత్సవ వేడుకకు నియోజకవర్గ టీడీపీ బాధ్యులు ఎరిక్షన్‌బాబు హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం త్యాగాలు చేసిన మహనీయులను స్మరించుకోవడం మన విధి అని అలాంటి భారత రాజ్యాంగం పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చిట్యాల వెంగల్‌రెడ్డి, ఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పెరుమాళ్ళ మల్లిఖార్జున, తెలుగుదేశం పార్టీ నాయకులు పేరం రమణారెడ్డి, కాపు నాయకులు తోటా మహేష్ నాయుడు, ఆర్యవైశ్య నాయకులు కొత్తమాసు సుబ్రహ్మణ్యం, మాగులూరి వెంకటేశ్వర్లు, కేశినేని మల్లిఖార్జున, ముస్లిం నేత షేక్ ఇస్మాయిల్, షేక్ మస్తాన్‌వలి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసీపీ వెలిగండ్ల పంచాయతీ కమిటీ ఏర్పాటు



**వెలిగండ్ల, జనవరి 26, ప్రభాతవార్త**

రాష్ట్రంలో గ్రామ కమిటీల ఏర్పాటును వైసీపీ గౌరవ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టారు. ఈ నేపథ్యంలో మార్కాపురం జిల్లా వెలిగండ్ల మండల కేంద్రంలో కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆదేశాల మేరకు పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, వెలిగండ్ల జడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో వెలిగండ్ల పంచాయతీ కమిటీ ఏర్పాటు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటక తిరుపతిరెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికి పార్టీ పదవులు దక్కుతాయని, త్వరలో కమిటీ సభ్యుల నియామకాలకు సంబంధించిన వివరాలు పార్టీ అధిష్టానం ప్రకటిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎలిక నారాయణ, గజ్జల నాగిరెడ్డి, కేలం శేఖర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, గోనా జేమ్స్, తాతపూడి నాని, అయినకోట వెంకట రంగయ్య, అయినకోట సుజాత, పెరుగు తిరుపాలు యాదవ్, ఎస్‌కే కమల్ వలి, సోము బాల చౌడారెడ్డి, గంగవరపు జైపాల్, కుమ్మరికుంట జైపాల్, జుటికే దేవసహాయం అబ్రహ, రాయుడు, మోషా, జిల్లా వైసీపీ సోషల్ మీడియా ఎగ్జిక్యూటీవ్ మెంబర్ సూరబోయిన గురుప్రసాద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేసిన గంగసాని



**పామూరు, జనవరి 26, ప్రభాతవార్త**

పామూరు పట్టణ తూర్పు వీధికి చెందిన యనమల రమణయ్య అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని పామూరు మండల వైసీపీ పార్టీ మండల కన్వీనర్ గంగసాని హుస్సేన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రమణయ్య ఆరోగ్య విషయం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం హుస్సేన్ రెడ్డి రమణయ్యకి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు గట్ల విజయభాస్కర్‌రెడ్డి, ఇర్రి కృష్ణారెడ్డి, షేక్ గయాజ్, నాయబ్ రసూల్, తుపాకుల ఆంజనేయులరెడ్డి, యాటా రాఘవేంద్ర, మానం ప్రసాద్, బాల బ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ అవార్డు అందుకున్న సబ్ రిజిస్ట్రార్ శాఖ ఉద్యోగి అమీర్



**సంతనూతలపాడు, జనవరి26 ప్రభాతవార్త**

సంతనూతలపాడు సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎస్‌డీ అమీర్ ఈ మేరకు సోమవారం నాడు ఒంగోలు పోలీసు గ్రౌండ్ నందు జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు నుండి ఉత్తమ అవార్డునుఅందుకున్నారు. మొదట సంతనూతలపాడు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సబ్ రిజిస్టర్ సీహెచ్ శ్రీనివాసరావు గణతంత్ర వేడుకల్లో భాగంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఉత్తమ అవార్డు అందుకున్న అమీర్‌ను సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

## ఉత్తమ ఎన్నెస్పీ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా అవార్డు అందుకున్న రహీమ్‌ను అభినందించిన అధికారులు, నీటి సంఘాల అధ్యక్షులు



**సంతనూతలపాడు, జనవరి 26, ప్రభాతవార్త**

ఒంగోలు పోలీసు గ్రౌండ్ నందు సోమవారం జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సంతనూతలపాడు ఎన్నెస్పీ కార్యాలయ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న షేక్ అబ్దుల్ రహీంకు జిల్లా కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్ రాజులు ఉత్తమ అవార్డును అందజేశారు. ఈసందర్భంగా ఎన్నెస్పీ కార్యాలయంలో సోమవారం నాడు జరిగిన కార్యక్రమంలో ఉత్తమ అవార్డు సాధించిన స్థానిక సంతనూతలపాడు సెక్షన్ సాగర్ కాలువల వర్క్ ఇన్‌స్పెక్టర్ షేక్ అబ్దుల్ రహీంను సంతనూతలపాడు ఎన్నెస్పీ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఐ.పద్మావతి, సంతనూతలపాడు ఒకటవ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు రామా శ్రీనివాసరావు, తదితరులు ప్రత్యేకంగా అభినందించారు. మొదట స్థానిక సాగర్ కార్యాలయం వద్ద జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండాను డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ పద్మావతి ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు రెండవ డిస్ట్రిబ్యూటర్ కమిటీ ఉపాధ్యక్షులు దామచర్ల శ్రీనివాసరావు, నీటి సంఘం అధ్యక్షులు అబ్బూరి శ్రీను, బొమ్మినేని తిరుపతి స్వామి, ఎన్నెస్పీ కార్యాలయ అసిస్టెంట్ ఇంజనీర్లు షేక్ కరిముల్లా భాష, జి.రమణారెడ్డి, ఎన్నెస్పీ కార్యాలయ ఉద్యోగులు తోట శ్రీనివాసరావు, షేక్ భషా, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ, పొట్టి శ్రీరాములులకు ఘన నివాళులు



**సంతనూతలపాడు, జనవరి 26, ప్రభాతవార్త**

సంతనూతలపాడులో సోమవారం నాడు వాసవి క్లబ్, వాసవి మహిళా క్లబ్, స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జాతీయ జెండాను వాసవి క్లబ్ అధ్యక్షులు వేమూరి ఆంజనేయులు, వాసవి మహిళా క్లబ్ అధ్యక్షురాలు వేమూరి నాగమణిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం, బస్టాండ్ సెంటర్ వద్ద గల గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు వీరు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ వేమూరి నాగేంద్ర ప్రసాద్‌రావు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పబ్లిశెట్టి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య కళ్యాణ మండపం ఉపాధ్యక్షులు ఎస్.సత్యనారాయణ, సెక్రటరీ పబ్లిశెట్టి ఆంజనేయులు, వాసవి క్లబ్ గౌరవ అధ్యక్షులు వేమూరి వెంకట శేషారావు, అధ్యక్షులు వేమూరి ఆంజనేయులు, సెక్రటరీ ఎస్.రాజేష్, కోశాధికారి పామిడి సుధాకర్, వాసవి మహిళా క్లబ్ అధ్యక్షురాలు వేమూరి నాగమణి, సెక్రటరీ ఎస్.జయశ్రీ, వాసవి మహిళా క్లబ్ ప్రతినిధులు ఎస్.విజయలక్ష్మి, ఇంద్రజ, జి.వెంకట లక్ష్మీ, సీహెచ్ సుజాత, వాసవి క్లబ్, ఆర్యవైశ్య నాయకులు జి.బద్రి నారాయణ, సీహెచ్ బ్రహ్మయ్య, వేమా శ్రీను, నల్లమల్లి శ్రీనివాసరావు, వి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని వాసవి క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ వేమూరి నాగేంద్ర ప్రసాద్‌రావు పర్యవేక్షించారు. అనంతరం స్వీట్స్ పంపిణీ చేశారు.

## కలెక్టర్, ఎస్పీల నుండి ఉత్తమ అవార్డు అందుకున్న మద్దిపాడు ఎస్సై సూర్య



**సంతనూతలపాడు, జనవరి 26, ప్రభాతవార్త**

ఒంగోలు పోలీసు గ్రౌండ్ నందు సోమవారం నాడు జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో మద్దిపాడు ఎస్సై జి.వెంకట సూర్య ఉత్తమ అవార్డును అందుకున్నారు. జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజులు మద్దిపాడు ఎస్సై వెంకట సూర్యకు ఉత్తమ అవార్డును అందజేశారు. పలువురు ఉత్తమ అవార్డు అందుకున్న ఎస్సై సూర్యను అభినందించారు.

## టీడీపీ కార్యాలయంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



**సంతనూతలపాడు, జనవరి 26, ప్రభాతవార్త**

సంతనూతలపాడులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల టీడీపీ ఆధ్వర్యంలో సోమవారం నాడు 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షులు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రావులపల్లి వెంకట సురేష్‌బాబు,మండల టీఎన్‌టీయుసీ అధ్యక్షులు పావులూరి నారాయణస్వామి చౌదరి, మండల తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు ఎన్.మాధవిలత, టీడీపీ నాయకులు బొడ్డపాటి చంద్రశేఖర్, రాంకూరి జార్జి, నల్లగట్ల సుబ్బారావు, మట్టా పోలిశెట్టి, కుంచాల ఆంజనేయులు, ఏ.మాధవ్, బొడ్డు శ్రీహరి, డి.హరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించి కంచె

**- గ్రామ బొడ్డురాయిని సైతం వదలని ఆక్రమణదారుడు**

**- అధికారులు పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తుల వినతి**

**- ఆక్రమణదారునిపై కన్నెర్ర చేసిన మాజీ ప్రజా ప్రతినిధులు బైరెడ్డి, దారపనేని**







**పామూరు, జనవరి26, ప్రభాతవార్త**

పామూరు మండలంలోని తూర్పు కోడిగుడ్లపాడు పంచాయతీ పరిధిలో గల పోతవరం గ్రామ రహదారిని వైసీపీకి చెందిన చెనికల మాల్యాద్రి గ్రామ రహదారిని, గ్రామ బొడ్డు రాయిని సైతం యధేచ్ఛగా ఆక్రమించి ఇనుప కంచె వేసి గ్రామస్తులను ఇబ్బందులకు గురి చేయడం పట్ల కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు మైరెడ్డి జయరామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఈ రహదారి 2009-14వ సంవత్సరంలో అప్పటి, ప్రస్తుత శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, అప్పటి ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ 5 లక్షల రూపాయలు నిధులుమంజూరు చేసి మెటల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. 2014-19 వ సంవత్సరంలో 2 కోట్ల రూపాయల నిధులతో అధికారుల పర్యవేక్షణలో 20 అడుగుల మేర రోడ్డును విస్తీర్ణం చేసి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. 2023లో గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు చెనికల మాల్యాద్రి, గ్రామ రహదారిని, గ్రామ దేవత బొడ్డురాయిని 10 అడుగుల మేర ఆక్రమించగా మీకు దిక్కున్న వారికి చెప్పుకోమని ఆక్రమణదారుడు సమాధానమిస్తున్నాడని గ్రామస్తులు వాపోయారు. ఈ విషయంపై ఫిబ్రవరి 2వ తేదీన కొత్తగా ఏర్పాటు అయిన మార్కాపురం జిల్లా కలెక్టర్ వారికి గ్రామస్తులతో కలిసి గ్రీవెన్స్ లో అర్జీ ఇవ్వడం జరుగుతుందని దారపనేని బైరెడ్డి తెలిపారు. గ్రామానికి సంబంధించిన రైతు కూండ్ల వెంకట స్వామి మాట్లాడుతూ సర్వే నెంబరు 86లో తాను ఐదు ఎకరాల సెటిల్ మెంట్ భూమిని కొనుగోలు చేసి సాగు చేస్తున్నానని అయితే అసైన్మెంట్ ఆక్రమణదారుడు చెనికల మాల్యాద్రి పొలంలోకి వెళ్లేందుకు దారి లేకుండా ఇబ్బంది పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆక్రమణలపై గతంలో పలుమార్లు అధికారులకు అర్జీలు పెట్టిన స్పందన లేదని ప్రస్తుత అధికారులు స్పందించి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కమలా స్కూళ్లలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



**మార్కాపురం, జనవరి 26,ప్రభాతవార్త**

స్థానిక తర్లుపాడు రోడ్‌లోని కమలా సీబీఎస్ఈ హైస్కూల్‌తో పాటు మార్కాపురం పట్టణంలోని కమలా కాన్సెప్ట్ స్కూల్‌లలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని దేశభక్తిని చాటారు. కమలా సీబీఎస్ఈ హైస్కూల్‌లో పాఠశాల కరస్పాండెంట్ పి పవన్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించి భారత రాజ్యాంగ విశిష్టతను వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు డా స్వరూప్ రంజన్ రాజ్యాంగ విలువలను గౌరవించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మార్కాపురంలోని కమలా కాన్సెప్ట్ స్కూల్‌లో కరస్పాండెంట్, వైస్ చైర్మన్ పెనుగొండ పవన్ కుమార్, హెడ్మాస్టర్ మద్దికుంట్ల పెద్ద పుల్లయ్య డా బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. రాజ్యాంగంపై అవగాహనతో బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసి, విద్యార్థులకు మిఠాయిలు పంచారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జార్జ్ ఫార్మా కళాశాలలో అంగరంగ వైభవంగా 77వ గణతంత్ర దినోత్సవం



**మార్కాపురం, జనవరి 26,ప్రభాతవార్త**

డా శామ్యూల్ జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా డి ప్రసన్న కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. భారత రాజ్యాంగం అందించిన హక్కులు, కర్తవ్యాలను విద్యార్థులు అవగాహన చేసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన దేశభక్తి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆఫ్ అకాడమిక్స్ డా వై సునీత, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా కె అశోక్ బాబు, ఐక్యూ ఏసీ ఇన్‌చార్జ్ సయ్యద్ ముజీబ్ పాల్గొన్నారు. సుమారు 400 మంది విద్యార్థులు వేడుకల్లో పాల్గొన్నారు.

## ప్రభుత్వ శకటాల ప్రదర్శనకు విశేష స్పందన

**- ప్రథమ స్థానంలో నిలిచిన పంచాయితీరాజ్ శాఖ శకటం**



**మార్కాపురం, జనవరి 26, ప్రభాతవార్త**

77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది.

ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పౌరులకు అందిస్తున్న సేవలను విభాగాల వారీగా ప్రతిబింబించేలా శకటాలను రూపొందించారు. ఈ ప్రదర్శనలో వ్యవసాయ, ఉద్యానవన, విద్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (వెలుగు), వైద్య ఆరోగ్య, పంచాయతీ రాజ్-గ్రామ/వార్డు సచివాలయాలు, పశు సంవర్ధక-మత్స్య శాఖ, డ్వామా, ఏపీఎస్ఆర్టీసీ శాఖల శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శకటాల రూపకల్పన, ప్రజలకు అవగాహన కల్పించే విధానాన్ని పరిశీలించిన అనంతరం న్యాయనిర్ణేతలు బహుమతులు ప్రకటించారు. పంచాయతీ రాజ్ శాఖ (మార్కాపురం జిల్లా)కు మొదటి బహుమతి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)కు ద్వితీయ బహుమతి, వ్యవసాయ-ఉద్యానవన శాఖలకు తృతీయ బహుమతి దక్కాయి. ఏపీఎస్ఆర్టీసీ శాఖకు కన్సోలేషన్ బహుమతి లభించింది. ప్రజలతో ప్రభుత్వ కార్యక్రమాలను దగ్గర చేసేలా శకటాల ప్రదర్శన విజయవంతంగా నిర్వహించడంపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**- ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల విజయ్ శ్రీనివాస్**



**వలేటివారిపాలెం, జనవరి 26, ప్రభాతవార్త**

మండలంలోని నల్లదలపూరు జిల్లా పరిషత్ ఉన్నత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిధిగా ప్రకాశం ఇంజనీరింగ్ కాలేసీ సంస్థల అధినేత కి.శే కంచర్ల రామయ్య పెద్ద కుమారుడు ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల విజయ్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కదిరి



**సీఎస్‌పురం, జనవరి 26, ప్రభాతవార్త**

మనం బ్రిటీష్ పాలన నుండి పూర్తిగా విముక్తి పొంది, మన స్వతం పాలనా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నామని మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు అన్నారు. సోమవారం శీలంవారిపల్లిలోని కదిరి బాబురావు వ్యవసాయ, ఉద్యాన కళాశాలలో ఘనతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతీయ జెండాను చైర్మన్ కదిరి ప్రకాష్‌రావు, విద్యాసంస్థల వ్యవస్థాపకులు మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ మన రాజ్యాంగాన్ని రూపొందించడంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పాత్ర అనన్యమైందని ఆయన నేతృత్వంలోని రాజ్యాంగ పరిషత్, దాదాపు 2 సంవత్సరాల 11 నెలల 18 రోజుల పాటు కష్టపడి, ప్రపంచంలో అతి పెద్ద లిఖిత రాజ్యాంగాన్ని రూపొందించింది. ఇది మన దేశంలోని ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం సోదరభావం వంటి ప్రాథమిక హక్కులను అందించిందని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరుకొని సమాజాభివృద్ధికి పాటుపడాలన్నారు. దేశంలో ఎక్కువ శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని రైతులు గిట్టుబాటు ధరలు లేక ఆర్థికంగా నష్టపోతున్నారని వ్యవసాయ విద్యార్థులు తమ మేథస్సును ఉపయోగించి రైతులకు సలహాలు సూచనలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కదిరి ప్రకాష్‌రావు, కళాశాల డీన్ డాక్టర్ పి.వీరన్న గౌడ్, సర్పంచ్ షేక్ బుజ్జి, మాజీ ఎంపీటీసీలు మునగల నారాయణరెడ్డి, మూరం కాశిరెడ్డి, గోను చంద్రశేఖర్‌రెడ్డి, టి.బాబురావు, టి.లక్ష్మీ నారాయణ, మస్తాన్‌రెడ్డి, నున్నా నారాయణ, కొట్టె శ్రీను, గ్రామ పెద్దలు, విద్యార్థులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ జెండాను ఆవిష్కరించిన టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి



**హనుమంతునిపాడు, జనవరి 26, ప్రభాతవార్త**

మండలంలోని హనుమంతాపురం సచివాలయంలో నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో ముఖ్య అతిధిగా టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి పాల్గొని జాతీయ పతాకానికి వందనం చేశారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మహనీయులు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు చీకటి వెంకట సుబ్బయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు నాగురి కోటయ్య, నందనవనం సర్పంచ్ ఏసు, ఉమ్మనపల్లి బూత్ ఇన్‌చార్జి యలనాటి బలరాం, సచివాలయం సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే మండల క్లస్టర్ ఇన్‌చార్జి గాయం తిరుపతిరెడ్డి



**హనుమంతునిపాడు, జనవరి 26, ప్రభాతవార్త**

మండలంలోని హాజీపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో ముఖ్య అతిధిగా టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి గాయం తిరుపతిరెడ్డి పాల్గొని జాతీయ పతాకానికి వందనం చేశారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించి మహనీయులు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, పాఠశాల సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



**గిద్దలూరు, జనవరి 26 ప్రభాతవార్త**

గిద్దలూరు పట్టణంలోని విశ్వభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి కమాండర్ ఎస్‌వి రెడ్డి (రిటైర్డ్), ఆఫీసర్ ఇన్‌చార్జ్ - ఈసిహెచ్‌ఎస్ పాలీక్లినిక్, గిద్దలూరు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. విద్యార్థులు దేశభక్తి గీతాలు, నృత్యాలు, ప్రసంగాలతో అలరించగా, పాఠశాల యాజమాన్యం గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను వివరించింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉత్తమ అవార్డు అందుకున్న వెలుగు సిసి ఆంజనేయులు



**త్రిపురాంతకం, జనవరి 26,ప్రభాతావార్త**

77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నూతనంగా ఏర్పడైన మార్కాపూర్ జిల్లాలో ఏర్పాటు చేసిన గణతంత్ర వేడుకల కార్యక్రమంలో త్రిపురాంతకం వెలుగు సిసి ఆంజనేయులు జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు చేతులమీదుగా ఉత్తమ అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. వెలుగుసిసి ఆంజనేయులు త్రిపురాంతకం మండలంలో వెలుగు ఆఫీస్ నందు క్లస్టర్ కో ఆర్డినేటర్ గా విధులు నిర్వహిస్తు, తన భాధ్యతలు గుర్తేరిగి మహిళల ఆర్థికాభివృద్ధికి దోహద పడుతూ, ఉద్యోగ భాధ్యతలో నిర్విరామంగా పని చేస్తున్నారు. తన సేవలను గుర్తించిన ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం సందర్భంగా రోజున వెలుగు మండల సిసి ఆంజనేయులుకు గుర్తింపునిస్తూ ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

## ఘనంగా గణతంత్ర దినోత్సవం వేడుకలు



**రాచర్ల, జనరల్ 26 ప్రభాతవార్త**

మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి, తహసిల్దార్ ఎల్ వెంకటేశ్వర్లు, ఎంఈఓ వి గిరిధర శర్మ, ఏవో షేక్ మహబూబ్ బాషా, ఏపిఎం కె నరేష్‌లు జాతీయ జెండాను తమ తమ కార్యాలయాల్లో ఆవిష్కరించారు.

గణతంత్ర దినోత్సవ ఔన్నత్యాన్ని విద్యార్థులకు ప్రజలకు తెలియజేశారు. జడ్పీహెచ్‌ఎస్, ఎంపీపీఎస్, మరియు కస్తూర్బా, మోడల్, గురుకులం పాఠశాలలో ఆయా పాఠశాలల యాజమాన్యాలు జండా వందన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. మండల టిడిపి అధ్యక్షులు యోగానంద్, టిడిపి నాయకులు, పలువురు ఎంపీటీసీలు, కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## కురిచేడు ఏఎస్సైకి ప్రతిభా పురష్కారం



**కురిచేడు, జనవరి 26, ప్రభాతవార్త**

77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కురిచేడు ఏఎస్సై మోహన్‌రావుకు ప్రతిభా పురష్కారం లభించింది. ఒంగోలులో సోమవారం నాడు జరిగిన 77వ గణతంత్ర దినోత్సవం వేడుకలో కలెక్టర్ రాజాబాబు చేతుల మీదుగా డీజీపీ మెడల్‌ను కురిచేడు ఏఎస్సై అందుకున్నారు. దాంతో పాటు ప్రశంసా పత్రం అందించారు. విషయం తెలుసుకున్న కురిచేడు మండల పలువురు నాయకులు, అధికారులు ఏఎస్సైకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## క్రికెట్ పోటీలలో ద్వితీయ స్థానం సాధించిన కొమరోలు జట్టు



**కొమరోలు, జనవరి 26, ప్రభాతవార్త**

గణతంత్ర దినోత్సవం సందర్భంగా గిద్దలూరు సబ్ డివిజన్ పరిధిలోని నలుగురు సెక్షన్‌ల టీమ్స్‌కి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. మొదటి మ్యాచ్ గిద్దలూరు, ముళ్లపాడు జట్లు పాల్గొనగా గిద్దలూరు గెలుపొందింది. రెండో మ్యాచ్లో కొమరోలు, రాచర్ల టీములు తలపడగా కొమరోలు టీం గెలుపొందింది, ఫైనల్‌గా గిద్దలూరు, కొమరోలు టీములు ఫైనల్స్‌లో తలపడగా గిద్దలూరు జట్టు మొదటి బహుమతి గెలుచుకోగా కొమరోలు జట్టు ద్వితీయ బహుమతి గెలుపొందింది. గిద్దలూరు ఏడి శేషగిరిరావు, ఏఈలు గెలుపొందిన జట్లకు బహుమతులు ఇవ్వడం జరిగింది. టోర్నమెంట్లో ఫైనాన్స్‌లో 68 పరుగులు చేసినటువంటి విజయ్ కి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ రావడం జరిగింది. టోర్నమెంట్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆల్ రౌండర్ రవికి మాన్ అఫ్ ది సిరీస్ ఇవ్వడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

## వైసీపీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ



**కందుకూరు జనవరి 26, ప్రభాతవార్త**

కందుకూరు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆఫీస్‌లో సోమవారం వైసీపీ ఇన్‌చార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో 77వ గణతంత్రదినోత్సవ వేడుకలు ఘనముగా నిర్వహించారు.1950లో భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిందని వక్తలు అన్నారు. భారతదేశం సార్వభౌమ, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా మారిందన్నారు.దేశానికి పూర్తిస్థాయి స్వయంప్రతిపత్తి లభించిన రోజున దేశ ప్రజలందరికీ సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం వంటి విలువలను గుర్తుచేసుకుంటూ దేశ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ వేడుకలో వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జగినది.

## మహనీయుల త్యాగాలు స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలి

### - దద్దాల నారాయణ యాదవ్



**కనిగిరి, జనవరి 26, ప్రభాతవార్త**
దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల అడుగు జాడల్లో నడవాలని, వారి త్యాగాలను మరవకుండా స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పిలుపునిచ్చారు. కనిగిరిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జవహర్‌లాల్ నెహ్రూ, లాల్ బహుదూర్ శాస్త్రి, సర్దార్ వల్లభాయ్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్, భగత్ సింగ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక మంది అమరుల త్యాగ ఫలితమే ఈ రోజు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా వాతావరణం అని కొనియాడారు. రాజ్యాంగ విలువలను కాపాడుతూ దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, సిరుప గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, రామనబోయిన శ్రీనివాసులు, షేక్ పోలిచర్ల రహీం భాషా, మందాడి కృష్ణారెడ్డి, సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, శ్యామల సాంబిరెడ్డి, పెరికల వెంకటేశ్వర్లు, ఓబులేసు, కన్నెటి సుబ్బారెడ్డి, యాల్ల కృష్ణారెడ్డి, దేవర వెంకటేశ్వర్లు, మల్లెల వెలుగొండయ్య, చీమలదిన్నె వెంగయ్య, పోతిరెడ్డి రమణారెడ్డి, బలసాని మోహన్, ఎర్రబల్లి సోరేలు, బీరం కృష్ణారెడ్డి, దాసరి మాల్యాద్రి, అంబటి మోహన్ రెడ్డి, యనమల గోవిందరెడ్డి, కసిరెడ్డి రామసుబ్బారెడ్డి, మిట్ట రమేష్‌రెడ్డి, సేక్ కాదర్ జిలాని, ఏకుల వెంకట సుబ్బారెడ్డి, ఆదం పునుగోడు, మన్నేపల్లి పేరుతు, కాకు నాగేశ్వరరావు, సారే సుధాకర్ నాయుడు, ఏలికా శ్రీనివాసులు, అత్యల ఇషాక్, కల్లు రవీందర్‌రెడ్డి, వంకదారి రాజా, తమ్మునేని వెంకటరెడ్డి, చీమలదిన్నె శివ, షేక్ సన్నీ, సంగు కృష్ణారెడ్డి, సేలం శివారెడ్డి, పాపనబోయిన నాగరాజు, పైడాల మోహన్ రెడ్డి, పగడాల శివకృష్ణ, మోరసుబ్బారెడ్డి, తమ్మనేని కొండారెడ్డి, మూలే మాల్యాద్రిరెడ్డి, స్వర్ణ యానాది, పాలూరి రణధీర్‌రెడ్డి, బ్రహ్మయ్య, సగిలీ వెంకటేశ్వరరెడ్డి, పాలూరి శివారెడ్డి, అంగ్ర వెంకటరావు, మీనుగ పెద్ద తిరుపతయ్య, గుడిమెట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డుల బలోపేతంపై చైర్మన్ల కలయిక



**కనిగిరి, జనవరి 26, ప్రభాతవార్త**
మార్కాపురం జిల్లాలో 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ల ఆత్మీయ కలయిక కార్యక్రమంలో కనిగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్ పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో మార్కెట్ యార్డుల అభివృద్ధి, రైతులకు మెరుగైన సౌకర్యాల కల్పన, వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ విధానాల బలోపేతంపై ఈ సమావేశంలో చర్చలు జరిగినట్లు తెలిసింది. జిల్లా వ్యాప్తంగా మార్కెట్ కమిటీల మధ్య సమన్వయం పెంపొందించుకోవడం, రైతులకు లాభదాయక ధరలు అందేలా చర్యలు తీసుకోవాలనే అంశాలపై చైర్మన్లు అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా గణతంత్ర దినోత్సవ ప్రాధాన్యతను గుర్తు చేస్తూ దేశ అభివృద్ధిలో రైతుల పాత్ర అత్యంత కీలకమని పలువురు చైర్మన్లు పేర్కొన్నారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

## త్రివర్ణ తరంగాల్లో ప్రగతి విద్యార్థుల దేశభక్తి ప్రదర్శన



**కనిగిరి, జనవరి 26, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణంలోని ప్రగతి విద్యా నిలయం ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యా సంస్థల కరస్పాండెంట్ కొప్పోలు ప్రభాకర్, డైరెక్టర్ కే.సందీప్ జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించిన వారు, దేశభక్తి భావనతో చదువుతో పాటు మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థులు పట్టణంలోని ప్రధాన వీధుల్లో 200 మీటర్ల భారీ త్రివర్ణ పతాకంతో నిర్వహించిన ర్యాలీ విశేష ఆకర్షణగా నిలిచింది. త్రివర్ణ తరంగాల మధ్యనడిచినవిద్యార్థుల క్రమశిక్షణ,దేశభక్తి నినాదాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన పిరమిడ్ విన్యాసాలు, సంప్రదాయ కోలాటనృత్యాలు వేడుకలను ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షులు షేక్ గయాజ్ భాష, పీఈటీ కే.శ్రీనివాసులు, కోలాట నృత్య మాస్టర్ నాగార్జున, ప్రగతి విద్యా నిలయం ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### వాసవి వీకేఎస్పీ నేతృత్వంలో విద్యార్థులకు పరీక్షా మెటీరియల్ పంపిణీ



**కనిగిరి, జనవరి 26, ప్రభాతవార్త**
పట్టణంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం జరిగిన రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా వాసవి వీకేఎస్పీ నేతృత్వంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీలకు పరీక్షా సామాగ్రి పంపిణీ చేయబడింది. ప్రధానోపాధ్యాయురాలు కలవ విజయలక్ష్మీ ఈ కార్యక్రమం ఎంతో ప్రశంసనీయమైన సేవా ప్రయత్నం అని వ్యాఖ్యానించారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి, వాసవి వీకేఎస్పీ కనిగిరి పట్టణ అధ్యక్షులు రాచపూటి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు చక్కా బసవేశ్వరావు, కార్యదర్శి చెన్నా మోహన్, కోశాధికారి కొలిపాకుల కిరణ్, అలాగే వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అవసరమైన పరీక్షా సామాగ్రి అందించడమే కాకుండా, సేవా భావనను, సామాజిక బాధ్యతను కూడా పెంపొందించడం లక్ష్యం అని నిర్వాహకులు తెలిపారు.

### బీఆర్ ఆక్స్‌ఫర్ట్ కళాశాలలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



**కనిగిరి, జనవరి 26, ప్రభాతవార్త**
కనిగిరి బీఆర్ ఆక్స్‌ఫర్డ్ కళాశాలలో సోమవారం ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. చైర్మన్ ఉన్నం భాస్కరరావు, డైరెక్టర్లు ఎస్‌కే షియాజ్, బి.బాల భాస్కర్, జి.నరేంద్ర, పి.రాంబాబు, బాయ్స్ క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.రంగా ఉత్సవాలలో పాల్గొని విద్యార్థులతో కలిసి జాతీయ జెండా ఆవిష్కరణ, దేశభక్తి కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులు పాటలు, నృత్యాలు, కవితా ప్రదర్శనలు ద్వారా వేడుకలను మరింత ఉల్లాసభరితంగా మార్చారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను గుర్తు చేసుకుంటూ, దేశభక్తి భావాన్ని పెంపొందించడంలో ముఖ్యమైన అవకాశం ఏర్పరిచింది.

## జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎంపీడీవో రాజ్యలక్ష్మి





**కొరిసపాడు, జనవరి 26, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన కొరిసపాడులోని ఎంపీడీవో కార్యాలయంలో 77వ గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఎంపీపీ సాదినేని ప్రసన్నకుమారి మస్తాన్ రావులతో కలిసిఈ గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొన్నారు. ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ,రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1947 ఆగస్టు 15న భారతీయులు ఆంగ్లేయుల నుంచి స్వేచ్ఛ వాయువులను పీల్చుకున్న సందర్భంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించుకుంటున్నారన్నారు. అనంతరం 1950 జనవరి 26 న భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి మన దేశం గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించిందన్నారు. ఆనాటి నుంచి ప్రతి సంవత్సరం జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకలను భారతదేశ ప్రజలు ఘనంగా నిర్వహించు కుంటున్నారన్నారు. ప్రతి పౌరుడు రాజ్యాంగబద్ధంగా నడుచుకుంటూ మంచి పౌరులుగా మెలగాలంటూ పిలుపునిచ్చారు. ఈ వేడుకలలో వారితో పాటు జడ్పిటిసి తుళ్లూరు వెంకటరమణ,ఎంఈఓ పున్నయ్య,ఏపీవో గాయత్రి లక్ష్మి,ఏపిఎం మాణిక్యరావుతో పాటు మండల కార్యాలయ సిబ్బంది పలువురు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వనిత క్లబ్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు







**అద్దంకి , జనవరి 26, ప్రభాతవార్త**
గణతంత్ర దినోత్సవ సందర్భంగా వాసవి వనిత క్లబ్ అండ్ వాసవి క్లబ్ రెండు క్లబ్బుల సమక్షంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం నాగులపాడు హైస్కూల్లో జెండా వందన కార్యక్రమం, పిల్లలకు పెన్నులు చాక్లెట్స్ బిస్కెట్స్ పంపిణీ, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ హోమ్ క్లబ్ నుండి రైజ్ కాలేజీలో సిద్ధ సూర్యప్రకాష్‌రావుతో జండా వందన కార్యక్రమంలో పాల్గొన్నారు. సింగరకొండలో వృద్ధాశ్రమాలలో పేద వృద్ధులకు నాలుగు రకాల పండ్లు బిస్కెట్లు పంపిణీ, ఆయా కార్యక్రమాలలో వాసవి వనిత క్లబ్ ప్రెసిడెంట్ కొత్త మాస్ నాగలక్ష్మి,సెక్రటరీ సునీత, ట్రెజరర్ సుజాత, ఊటుకూరి ఉమా అన్నపూర్ణ, అయిత రాజా,తాత హరిబాబు, ఉడుతు ఆదినారాయణ, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ గురుశేఖర్,బాలాజీ,నాగరాజు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

### రోటరీ క్లబ్ ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్

#### ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు



**చీరాల, జనవరి 26, ప్రభాతవార్త**
రోటరీ క్లబ్ ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్లబ్ మేడ పైన, గ్రౌండ్ నందు గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాక ఆవిష్కరణ జరిపి భారత రాజ్యాంగం వ్రాసిన మహనీయుల గురించి స్మరించుకున్నారు. ఉమెన్స్ డిగ్రీ కళాశాల వేడుకలలో రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొని పైపు లైన్ రిపేరు నిమిత్తం ప్రెసిడెంట్ జాలాది కృష్ణమూర్తి రూ.6వేలు నగదు వైస్ ప్రిన్సిపాల్ రత్నప్రభ కి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాలాది కృష్ణమూర్తి, పోలుదాసు రామకృష్ణ, డాక్టర్ బాబురావు, బి.హేమంత్ కుమార్, చారగుళ్ళ గురు ప్రసాద్, శ్రీనివాస బాబు, వలివేటి మురళీకృష్ణ, ప్రసాద్, డాక్టర్ దేగల శ్రీనివాస్, రోటరీ వాకింగ్, ఉమెన్స్ డిగ్రీ కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## చేనేతపై పెనుభారం

### - జరీ ధరల పెరుగుదలతో సంక్షోభంలో చేనేత వ్యవస్థ



**వేటపాలెం, జనవరి 26, ప్రభాతవార్త**
ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటున్న చేనేత వ్యవస్థపై జరీ ధరల పెరుగుదల పెనుభారంగా మారింది. అంతర్జాతీయ మార్కెట్లో సిల్వర్ కాపర్ ధరలు పెరగడంతో చేనేత వస్త్రాలలో అంచు బార్డర్‌లు బుటాల తయారీలో ఉపయోగించే హెచ్ఎఫ్ జరీ ధరలు అమాంతంగా పెరిగాయి. దీని ప్రభావం నేరుగా చేనేత కార్మికులు మాస్టర్ వివర్స్ వినియోగదారులపై పడుతోంది. గత మూడు నుంచి నాలుగు నెలల క్రితం వరకు మార్కెట్లో 400 నుంచి 500 రూపాయల మధ్యలో లభ్యమైన జరీ మార్క్ ధర ప్రస్తుతం 850 నుంచి 9000 రూపాయలకు చేరింది. ఫలితంగా ఒక్కో చీరపై అదనంగా 300 నుంచి 400 రూపాయల వకు ఖర్చు పెరుగుతోంది. ఇప్పటికే నూలు ధరలు రంగులు రవాణా ఖర్చులు పెరిగిన నేపథ్యంలో ఈ జరీ ధరల పెరుగుదల చేనేత వ్యవస్థను మరింత ఒత్తిడిలోకి నెట్టుతోంది. ఇక పెరుగుతున్న నిత్యవసర ధరలను దృష్టిలో ఉంచుకుంటే చేనేత కార్మికులకు మజూరీల పెంపు అనివార్యం అవుతోంది. అయితే ఒక వైపు ముడిసరుకుల ధరలు మరో వైపు కూలీ భారం పెరుగుతుండడంతో చేనేత ఉత్పత్తి వ్యయం గణనీయంగా పెరిగింది. దీంతో చేనేతమాస్టర్ వివర్స్ వ్యాపారులు కొత్త ఆర్డర్లు తీసుకోవాలంటే వెనుకాడే పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితి కొనసాగితే చేనేత వ్యవస్థ భవిష్యత్ ఎలా ఉంటుందన్న సందిగ్ధత నెలకొంది. సంప్రదాయ వృత్తిగా వేలాది కుటుంబాలకు జీవనాధారంగా నిలుస్తున్న చేనేత రంగం మరింత సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం ఉందని రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ తరుణంలో వినియోగదారుల సహకారం అత్యంత అవసరం అని చేనేత వర్గాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. చేనేత వస్త్రాల వెనుక ఉన్న కష్టాన్ని ఖర్చులను అర్థం చేసుకుని నాణ్యతకు తగిన ధర చెల్లిస్తూ వ్యవస్థను నిలబెట్టే బాధ్యత అందరూ భాగస్వాములుగా తీసుకోవాలని కోరుతున్నారు. చేనేత కాపాడాలంటే ప్రభుత్వ మద్దతుతో పాటు వినియోగదారుల సహకారం కూడా అవసరమని, అప్పుడే ఈ సంప్రదాయ వృత్తి భవిష్యత్ తరాలకు నిలుస్తుందని చేనేత వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

### సోమయ్య దశదిన కర్మలో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దులూరి



**చీరాల, జనవరి 26, ప్రభాతవార్త**
బొచ్చులవారిపాలెం గ్రామం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు కీ.శే బచ్చుల సోమయ్య దశదిన కర్మకు ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



**లింగసముద్రం, జనవరి 26, ప్రభాతవార్త**
లింగసముద్రం మండల కేంద్రం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో 77వ గణతంత్ర దినోత్సవం వేడుకలు ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండా ఆవిష్కరించి, అందరికి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మేధావులు, త్యాగధనులు అనేక సంవత్సరాల పాటు అహర్నిశలు కృషి చేసి మన దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించారని తెలిపారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యమైన భారత రాజ్యాంగం 1950 జనవరి 26వ తేదీ నుండి పూర్తి స్థాయిలో అములలోకి వచ్చిందని, ఆ చారిత్రక రోజు నుండి ప్రతి సంవత్సరం గణతంత్రదినోత్సవాన్ని దేశ వ్యాప్తంగాఘనంగా నిర్వహించుకుంటున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు 1 కే.మాల్యాద్రి, 2 ఎంవీ శివకుఆర్,సీహెచ్ఓ శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో పూర్ణచంద్రరావు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్ కార్యాలయం సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

**తహసీల్దార్ కార్యాలయం :**
స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో ఎం.హనుమయమ్మ అధ్యక్షతన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1950 జనవరి 26వ తేదీన రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజుని పూర్తి సర్వసత్తాక ప్రజాస్వామ్య గణతంత్ర దినోత్సవం జరుపుకుంటామని, ఆ రోజు నుండి ప్రజలకు పూర్తి స్వాతంత్ర్య హక్కులు, స్వేచ్ఛ అందరికి స్వాతంత్ర్య అందాలని, చట్టాలను రూపొందించి, ప్రజలకు స్వేచ్ఛ అనే హక్కును ప్రసాదించారని తెలిపారు. ఆర్ఐ రమణయ్య, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఉత్తమ అటెండర్‌గా ఏడుకొండలు



**లింగసముద్రం, జనవరి 26, ప్రభాతవార్త**
ఒంగోలులో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా సోమవారం ఉత్తమ అటెండర్‌గా తోట ఏడుకొండలను అధికారులు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజాబాబు చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. రాళ్లపాడు ప్రాజెక్టు అటెండర్‌గా విధుల్లో చేరినప్పటి నుండి ప్రాజెక్టు వద్దనే ఉంటూ నిరంతరం పని చేసేవారు. అధికారులకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ విధులు పట్ల బాధ్యతగా ఉండేవారు దీంతో ఆయనను ఉత్తమ అటెండర్‌గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది, రైతులు ఏడుకొండలకు అభినందనలు తెలిపారు.

### కొండగురునాథ స్వామి తిరునాలకి వేముల గ్రామంలో వైసీపీ ప్రభ ఏర్పాటు

#### - జెండా బాతటానికి తరలి వెళ్లిన వైసీపీ నాయకులు



**ముండ్లమూరు,జనవరి 26, ప్రభాతవార్త**
నూజెండ్ల మండలం లోని రవ్వవరం గ్రామంలో కొండ గురునాథ స్వామి తిరునాల ఫిబ్రవరి 1వ తేదీన జరుగుతుండగా, ఈ సందర్భంగా మండలంలోని వేముల గ్రామంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు ప్రభని ఏర్పాటు చేసేందుకు ఆదివారం ర్యాలీగా బయలుదేరి కొండ గురునాథ కొండ దగ్గర వైసీపీ జెండాని బాతటం జరిగింది. ఈ తిరునాల పల్నాడు జిల్లా ప్రకాశం జిల్లాలకి సంబంధించిన తిరునాళ్ల కాబట్టి పెద్దఎత్తున భక్తులు పాల్గొని దేవుని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో వేముల గ్రామ వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉత్తమ తహసీల్దారు అవార్డ్ అందుకున్న జీవీ సుబ్బారెడ్డి



**కొరిసపాడు, జనవరి 26, ప్రభాతవార్త**
ఉత్తమ తహసీల్దారుగా కొరిసపాడు తహసిల్దార్ జివి సుబ్బారెడ్డి ఎంపికయ్యారు. సోమవారం ప్రకాశం జిల్లా కేంద్రంలో జరిగిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో కలెక్టర్ రాజాబాబు ఆయనకు అవార్డును అందజేశారు. విధి నిర్వహణలో ప్రజలకు మెరుగైన సేవలు అందించినందుకు ఆయనకు ఈ అవార్డు లభించింది.

## వృద్ధుల ఆశ్రమానికి ఆఫీసు టేబుల్ బహుకరణ





**అద్దంకి, జనవరి 26, ప్రభాతవార్త**
అళహరి వెంకట సుబ్బమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు అళహరి హరిప్రసాద్ సౌజన్యంతో రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి వారి ఆధ్వర్యంలో, శ్రీరామ వృద్ధుల ఆశ్రమం సింగరకొండ వారికి 15 వేల రూపాయల విలువ కలిగిన ఆఫీస్ టేబుల్ బహుకరించారు.. ఈ కార్యక్రమం లో రోటరీ అధ్యక్షులు బాచిన శివధర పూర్ణచంద్రరావు, సెక్రటరీ అళహరి హరిప్రసాద్, ట్రెజరర్ తమ్మన శ్రీనివాస రావు, సింగరకొండ పాలక మండల అధ్యక్షులు చుండూరి మురళీ సుధాకరరావు, రోటరీ పూర్వఅధ్యక్షులు చిన్ని మురళీకృష్ణ, చప్పిడి వీరయ్య, డాక్టర్ యు.దేవపాలన , షేక్ మొహమ్మద్ రఫీ, గూడ లక్ష్మీ రెడ్డి, ఆశ్రమ నిర్వాహకులు,వృద్ధులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సంఘానికి 10 వేలు విరాళం



**అద్దంకి , జనవరి 26,ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 77వ గణతంత్రదినోత్సవ వేడుకలు విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా డి.ఎస్. నకారా విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం సంఘ అధ్యక్షులు అడుసుమల్లి అనంతకోటేశ్వరరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు.గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను సందిరెడ్డి వెంకటేశ్వరరావు వివరించారు. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి ప్రతి పౌరుడు గౌరవించాల్సినవని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత పోస్టు మాస్టర్, పూర్వ రోటరీ కార్యదర్శి మలాది శ్రీనివాసరావు భవన నిధికి రూ.10 వేలు రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ వేడుకల్లో సంఘ కార్యదర్శి నిమ్మరాజు నాగేశ్వరరావు, కోశాధికారి వారణాసి రఘురామశర్మ, మక్కెన వెంకటేశ్వర్లు, పల్లపు ఆంజనేయులు, నర్ర గోపాల్, వఠ్యం సీతారామశాస్త్రి, యు.దేవపాలన, కె.పాపారావు, చప్పిడి వీరయ్య, పాటిబండ్ల శ్రీమన్నారాయణ,షేక్ మస్తాన్, పొన్నపల్లి బ్రహ్మానందం, గడ్డం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## సేవే గణతంత్ర ధర్మం - కాలేషా



**సంతమాగులూరు, జనవరి 26, ప్రభాతవార్త**
సేవే గణతంత్ర ధర్మమని షేక్ కాలేశా, సైదా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి షేక్ కాలేషా వలి అన్నారు. 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలం లోని కొమ్మాలపాడు గ్రామంలో కాలేషా సైదా చారిటబుల్ ట్రస్ట్, డాక్టర్స్ కంప్యూటరైజ్డ్ లేబరేటరీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఉచిత రక్త పరీక్షలు, కంటి పరీక్షల వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ వైద్య శిబిరాన్ని షేక్ కాలేషా వలి పర్యవేక్షించారు. శిబిరానికి కొమ్మాలపాడు గ్రామంతో పాటు పరిసర గ్రామాలైన మక్కెనవారి పాలెం, మామిళ్ళపల్లి, సజ్జాపురం, ఏల్చూరు తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.శిబిరానికి వచ్చిన రోగులకు కంటి వైద్యులు,కంప్యూటరైజ్డ్ లేబరేటరీ సిబ్బంది రక్త నమూనాలు సేకరించి అవసరమైన రక్త పరీక్షలు నిర్వహించి ఫలితాలను తెలియజేశారు. అలాగే ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ కు చెందిన కంటి వైద్యులు డా. బాబు, డా. షద్రక్, డా. దీప్తిలు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు తదుపరి చికిత్సల కోసం ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు సిఫార్సు చేశారు.శిబిరానికి వచ్చిన రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను షేక్ కాలేశా సైదా చారిటబుల్ ట్రస్ట్ సమర్థవంతంగా నిర్వహించారు. ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించడంతో రోగులు వైద్య శిబిరం ఏర్పాటు చేసిన నిర్వాహకులపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా షేక్ కాలేశావలి మాట్లాడుతూ,సంతమాగులూరు మండలంలోని కొమ్మాలపాడు, మార్టూరు, బల్లికురవ మండల కేంద్రాల్లో నిరంతరం ఉచిత రక్త పరీక్షలు, కంటి పరీక్షల వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తమ సేవా సంస్థ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా సేవే గణతంత్ర ధర్మంగా భావించి పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు.ఈ వైద్య శిబిరంలో 242 మందికి కంటి పరీక్షలు, 211 మందికి రక్త పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. శిబిరానికి సేవలందించిన ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు, డాక్టర్స్ కంప్యూటరైజ్డ్ లేబరేటరీ సిబ్బందిని ఆయన అభినందించారు.

### భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



**అద్దంకి , జనవరి 26, ప్రభాతవార్త**
అద్దంకి పట్టణంలో స్థానిక బంగ్లారోడ్డులో బిజెపి నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో బిజెపి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి అద్దంకి పట్టణ అధ్యక్షులు షేక్‌కాలేషాబాబువిరాట్ అధ్యక్షత వహించంగా, ముఖ్య అతిధులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి పరుచూరి శ్రీనివాసరావు, ఒబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు గాలం ప్రభాకర్ యాదవ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పరుచూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజున గణతంత్ర దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుంది. ప్రతి ఒక్కరూ కూడా రాజ్యాంగ బద్ధంగా ఉండాలని తెలిపారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్నకార్యకర్తలకు, ప్రజలకు అల్పాహారం పంపిణీ చేశారు.ఈ ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మంచెళ్ళ సుబ్రహ్మణ్యం, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి మందలపు గిరి, కొత్తమాసు నాగరాజు,విద్యాసాగర్, గురునాదం వెంకటేశ్వర్లు, కొండ్రగుంట శ్రీనివాసరావు, పట్టణ ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.

## ఉత్తమ అవార్డులు అందుకున్న అధికారులు



**ముండ్లమూరు, జనవరి 26, ప్రభాతవార్త**
మండలంలోని వివిధ శాఖలలో పని చేస్తున్న అధికారులు 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా అవార్డులను అందుకోవడం జరిగింది.

**ఉత్తమ జూనియర్ లైన్‌మెన్ నవీన్‌కి అవార్డు :**
మండలంలోని ఉమామహేశ్వరపురం సచివాలయంలో జూనియర్ లైన్‌మెన్‌గా పని చేస్తున్న నవీన్‌కి ఉత్తమ జూనియర్ లైన్‌మెన్‌గా నవీన్ చేసిన సేవలు ఉత్తమ సేవా అవార్డుని ప్రకాశం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ సిబ్బంది , పలువురు ప్రజలు అభినందనలు తెలిపారు.

**108 ఎమర్జెన్సీ ఉత్తమ ఉద్యోగికి అవార్డు :**
మండలంలోని 108 ఎమర్జెన్సీ సర్వీసులో పని చేస్తున్న గోవాపురంబోయిన సునీతకి ఉత్తమ ఉద్యోగి అవార్డు ఆమె చేసిన సేవలకి ప్రకాశం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చేతుల మీదుగా గణతంత్ర దినోత్సవం సందర్భంగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సునీతకి పలువురు అభినందనలు తెలిపారు.

**ఉత్తమ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ అధికారి శివరామకృష్ణకి అవార్డు :**
మండలంలో ఉత్తమ ఇంజనీరింగ్ కన్సల్టెంగ్‌గా ముండ్లమూరు నందు పని చేస్తున్న గుంటుపల్లి శివరామకృష్ణకి 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సేవలు అందించినందుకు ఉత్తమ సేవా అవార్డుని కలెక్టర్ పి.రాజాబాబు చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

